## క్లుప్తంగా

### శ్మశాన వాటికలకు స్థలాలు కేటాయించాలని వినతి



రేపల్లె: రేపల్లె డివిజన్ పరిధిలో శ్మశాన వాటికలు లేని ఎస్సీ పల్లెలకు స్థలాలు కేటాయించాలని జైభీమ్‌రావ్ భారత్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి దోవా రమేష్ రాంజీ కోరారు. శ్మశాన వాటిక స్థలాల విషయమై సోమవారం ఆర్డీవో రామలక్ష్మికి ఆయన వినతి పత్రం అందజేసి మాట్లాడారు. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిన నేటికి అనేక పల్లెల్లో శ్మశాన వాటికలు లేక పొలం గట్లు, రహదారులు వెంట దహన సంస్కారాలు చేయాల్సిన పరిస్థితులు ఉండటం శోచనీయమన్నారు. ఎస్సీ సబ్ ప్లాన్ ద్వారా రూ.వేల కోట్లను కేటాయింపు చేస్తున్నట్లు పాలక ప్రభుత్వాలు ప్రకటిస్తున్నా ఆచరణలో శూన్యంగా కనిపిస్తుందన్నారు. రెవెన్యూ అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి శ్మశాన వాటికలు లేని గ్రామాలను గుర్తించి వెంటనే స్థలాలను కేటాయించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వెంకటరావునాయుడు, కర్రా బాబురావు, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

### చిన్నారులకు ఆధార్ కార్డులు తీసుకోవాలి

ఎంపీడీవో శ్రీనివాసరావు



కర్లపాలెం: చిన్నారులకు ప్రభుత్వం ఆధార్ కార్డులు మంజూరు చేస్తుందని ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు చెప్పారు. గణపవరం గ్రామంలోని ఆధార్ సెంటర్‌ను సోమవారం ఎంపీడీవో శ్రీనివాసరావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరేళ్లలోపు ఉన్న చిన్నారులందరికీ తప్పనిసరిగా ఆధార్ కార్డును తీసుకోవాలని అన్నారు. చిన్నారులకు ఆధార్‌కార్డులు మంజూరు చేసేందుకు కర్లపాలెం మండలంలో కర్లపాలెం, గణపవరం, యాజలి గ్రామాలలో ఆధార్ కేంద్రాలు పని చేస్తున్నాయని చెప్పారు. ఆధార్ కార్డులు లేని చిన్నారుల తల్లిదండ్రులు తమ చిన్నారులను ఆధార్ సెంటర్లకు తీసుకుని వెళ్ళి ఆధార్ కార్డులు తీసుకోవాలని చెప్పారు. అలాగే ఇప్పటి వరకు రేషన్ కార్డులు లేని వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. రేషన్ కార్డులలో మార్పులు చేర్పులకు కూడా ప్రభుత్వం అవకాశం కల్పించిందని అవసరమైన వారు వినియోగించుకోవాలని ఎంపీడీవో చెప్పారు.

### సేంద్రియ వ్యవసాయంపై అవగాహన



చుండూరు(వేమూరు): రైతులు ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వాలని ప్రకృతి వ్యవసాయ శాస్త్రవేత్త ఎస్.శిరీష తెలిపారు. చుండూరు మండలంలోని మోదుకూరు గ్రామంలో రసాయన రహిత సేంద్రియ వ్యవసాయంపై సోమవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రణాళికాబద్ధంగా గ్రామంలో ఉన్న వనరులను వినియోగించుకుంటూ పంటలను సాగు చేసుకోవాలన్నారు. పలు పంటల విధానం, నవధాన్యాల సాగు, తేలికపాటి దుక్కుల విధానం గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జి జీ.వజ్రమ్మ, రైతులు పాల్గొన్నారు.

### సమంత చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు

చుండూరు(వేమూరు): సమంత చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని ట్రస్ట్ వ్యవస్థాపకులు తెనాలి సందీప్ అన్నారు. చుండూరు మండలంలోని ఆలపాడు గ్రామంలో సోమవారం సమంత చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. పేద విద్యార్థుల విద్యకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆరోగ్య కార్యక్రమాలు, ఉచిత వైద్య శిబిరాలు, రక్తదాన శిబిరాలు, గ్రామీణ ప్రాంతాలలో ఆరోగ్యంపై అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో చావలి నజేష్, కసుకుర్తి వెంకటేశ్వర్లు, దావులూరు యశ్వంత్, పెరవలి మోహన్ బాబు, కె.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### నీటి పన్ను తొలగించండి

తెనాలిఅర్బన్: మంచి నీటి పన్ను ఎక్కువగా వస్తుందని, దానిని తొలగించాలని 23వ వార్డువాసి కోరారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కమిషనర్ బండి శేషన్న అర్జీలు స్వీకరించారు. చినరావూరు పార్కు దారిలో ఆక్రమణలు తొలగించాలని, రామలింగేశ్వరపేటలో వాహనాలు రోడ్డుపై పెట్టకుండా చూడాలని పలువురు కోరారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఏసీ వీఎం లక్ష్మీపతిరావు, మేనేజర్ విల్సన్ జయకర్, ఆర్‌వో రాంప్రసాద్, ఏసీపీ శివన్నారాయణ పాల్గొన్నారు.

# అధ్వానంగా పంట కాలువలు

- పట్టించుకోని అధికారులు, నీటి సంఘాలు
- చివరి భూములకు నీరు అందని పరిస్థితి
- మరమ్మతులు చేపట్టాలని కోరుతున్న రైతులు



బూతుమల్లి వద్ద కాలువకు ఇరువైపులా చెట్లతో నిండిపోయిన కొల్లిపర చానల్

వేమూరు: విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. నైరుతి రుతుపవనాలు కూడా రాష్ట్రంలోకి ప్రవేశించాయని వాతావరణ శాఖ సమాచారం. ఈ క్రమంలో వ్యవసాయ పనులకు రైతులకు శ్రీకారం చుడుతున్నారు. మరి కొద్ది రోజులలో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుంది. అయినా ఇరిగేషన్ అధికారులు పంట కాలువల గురించి పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత నీటి సంఘాల వ్యవస్థను పునః ప్రారంభం చేశారు. నీటి సంఘాల వ్యవస్థ పంట కాలువల మరమ్మతులు చేపట్టడం జరుగుతుందని రైతులు ఆశ పడ్డారు. కానీ కాలువల మరమ్మతులు గురించి ప్రభుత్వం గానీ, నీటి సంఘాలు గానీ ఇంత వరకు పట్టించుకోకపోవడంతో రైతులు నిరాశకు గురవుతున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుండడంతో జూన్ నెలలో సాగు నీరు విడదల చేస్తారు. కానీ ఇరిగేషన్ అధికారులు, నీటి సంఘాల చైర్మన్‌లు సాగు నీటి కాలువలను పట్టించుకోవడం లేదని రైతులు చెబుతున్నారు. సాగు నీటి కాలువలు గుర్రపు డెక్క, కాలువలకు ఇరువైపులా గట్లపై ముళ్లపొదలు పెరిగి నీటి పారుదలకు ఇబ్బందిగా తయారయ్యాయి. అధికారులు, నీటి సంఘాల చైర్మన్‌లు ఇప్పటికైనా స్పందించి వెంటనే సాగునీటి కాలువల మరమ్మతులను చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

కొల్లిపర చానల్ ఆయకట్టు చివరి భూములకు సాగు నీరు అందక రైతులు ఇబ్బందులు పడే పరిస్థితులు ఉన్నాయి. కొల్లిపర చానల్ పరిధిలో మొత్తం 16 వేల ఎకరాలు ఆయకట్టు ఉంది. దాదాపు మండలంలోని పది గ్రామాలలోని

**చివరి భూములకు నీరు అందని పరిస్థితి**

రైతులు కొల్లిపర చానల్‌పై ఆధారపడి ఉన్నారు. కొల్లిపర చానల్ ద్వారా బూతుమల్లి కాలువ చివరి సాగు వరకు సాగు నీరు అందించేందుకు కాలువల మరమ్మతుల పనులు ఎపుడు చేస్తారో అర్థం కాని పరిస్థితి ఉందని రైతులు వాపోతున్నారు. సాగు నీటి కాలువల మరమ్మతు పనులు చేపట్టకపోవడంతో కాలువకు ఇరువైపుల ముళ్ల పొదలు పెరిగి కాలువల్లో పడిపోయి నీటి పారుదలకు ఆటంకం ఏర్పడినా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు అంటున్నారు. నీటి సంఘాల అధ్యక్షులు ఇరిగేషన్ కాలువల మరమ్మతు పనులు వెంటనే చేపట్టాలని వారు కోరుతున్నారు. వేసవి కాలం తర్వాత నీటి కాలువలు మరమ్మతుల పనులు చేపట్టడం కష్టంగా ఉంటుందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం, ఇరిగేషన్ అధికారులు వెంటనే సాగు నీటి కాలువల మరమ్మతు పనులు చేపట్టాలని రైతులు వేడుకుంటున్నారు.

#### మరమ్మతు పనులు చేపట్టాలి



ఇరిగేషన్ అధికారులు మరమ్మతు పనులు చేపట్టకపోవడంతో సాగు నీరు పొలాల్లోకి వెళ్లడం కష్టంగా ఉంటుంది. అందువల్ల అధికారులు కాలువల మరమ్మతు పనులు చేపట్టాలి.

– చొప్పర యాకోబు, జంపని

#### నీరు అందేలా చూడాలి



సాగు నీటి కాలువల మరమ్మతు పనులు చేపట్టకపోవడంతో చివరి సాగు భూములకు సాగు నీరు అందక పంటల దిగుబడిపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఇరిగేషన్ అధికారులు కాలువల మరమ్మతు పనులు చేపట్టి, చివరి భూములకు సాగు నీరు అందేలా చూడాలి.

– గోపాలం రాము, చావలి

## పేదల ఇళ్ల తొలగింపుకు నోటీసుల జారీ అమానుషం



తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న బేతపూడి గ్రామస్తులు

**సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్**

రేపల్లె: బేతపూడి గ్రామంలో రహదారి పక్కన సంవత్సరాలుగా నివాసం ఉంటున్న పేదల ఇళ్లను తొలగిస్తామంటూ అధికారులు పదే పదే నోటీసులు ఇవ్వటం అమానుషమని సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్ అన్నారు. పేదల గృహాలను తొలగించే ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ సీపీఎం, జై భీమ్‌రావ్ భారత్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం బాధితులు, గ్రామస్తులు తహసీల్దార్ కార్యాలయం వద్ద బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మణిలాల్ మాట్లాడుతూ రాజకీయ దురుద్దేశంతో ఎవరికీ అడ్డులేని పేదల గృహాల తొలగింపుకు పూనుకోవటం కుట్రేనన్నారు. కూలీ పనులు చేసుకుని జీవించే నిరుపేదలపై రాజకీయం చూపించటం తగదన్నారు. రహదారి పక్కన ఉన్న ఆ పూరిళ్ల వల్ల ఎవరికీ నష్టం లేదని గ్రామస్తులు చెబుతున్నప్పటికీ గ్రామంలోని మాజీ ప్రజాప్రతినిధి ఒత్తిడితో అధికారులు వేధింపులకు పాల్పడటం బాధాకరమన్నారు. అధికారులు తరచూ నోటీసులు ఇవ్వటంతో తమ పూరిళ్లు ఎక్కడ కూలదోస్తారోనన్న భయంతో ఆ నిరుపేదలు గత పది రోజుల నుంచి పనులకు వెళ్లకుండా ఇళ్ల వద్దనే బిక్కుబిక్కుమంటూ ఉంటున్నారన్నారు. అధికారులు రాజకీయాలను పక్కనపెట్టి మానవతా దృక్పథంతో పేదల ఇళ్లను కూలగొట్టే ఆలోచనను విరమించుకోవాలన్నారు. లేనిపక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని పరిస్థితులను తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో ఎం.శోభారాణి, సీఐ మల్లికార్జునరావులకు వివరించారు. కార్యక్రమంలో జై భీమ్‌రావ్ భారత్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి దోవా రమేష్ రాంజీ, సీపీఎం, జై భీమ్ పార్టీ నాయకులు, వివిధ ప్రజా సంఘాల నేతలు, బాధిత కుటుంబాల సభ్యులు పాల్గొన్నారు.



అధికారులకు సమస్యను విన్నవిస్తున్న సీపీఎం, జై భీమ్ భారత్ పార్టీ నాయకులు, గ్రామస్తులు

## కొనసాగుతున్న హనుమత్ జయంతి మహోత్సవాలు

తెనాలి: స్థానిక షరాఫ్‌బజార్‌లో వేంచేసి ఉన్న శ్రీసువర్చలా సమేత శ్రీపంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానంలో వార్షిక శ్రీ హనుమత్ జయంతి మహోత్సవాలు, 17వ లక్ష శ్రీ హనుమాన్ చాలీసా పారాయణ కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారికి విశేష పూజలు, శ్రీమన్యసూక్త హోమాన్ని ఆలయ వంశ పారంపర్య అర్చకుడు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో వైఖానస పండితుడు నాగమారుతి బృందం ఆగమోక్తంగా నిర్వహించింది. సాయంత్రం 1108 లడ్డూలతో విశేష పూజాది కార్యక్రమాలు చేశారు. 108 మంది భక్తులు 108 సార్లు శ్రీహనుమాన్ చాలీసా పారాయణ చేశారు. ఆలయ ఈవో అవుతు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ 11 రోజులు పాటు జరిగే ఉత్సవాల్లో ప్రతిరోజు విశేష పూజలు, హోమాలు జరుగుతాయని, భక్తులు విశేషంగా పాల్గొని స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు. అర్చకులు శ్రీనివాసమూర్తి, కిరణ్ కుమార్, సురేష్, వైకుంఠపురం ట్రస్ట్‌బోర్డు మాజీ చైర్మన్ వుప్పల వరదరాజులు, కౌన్సిలర్ పి.త్రిమూర్తి, సంకీర్తన బృందం అధ్యక్షురాలు మూర్తి అనురాధ, ట్రస్టు సభ్యులు గుడివాడ బాలకృష్ణ, మూర్తి వెంకటేశ్వరరావు, ముదుపల్లి చంద్రశేఖర్, జంధ్యం రామారావు, గాజుల రాజేంద్రప్రసాద్, మాజేటి వెంకటేష్, మద్దు హరీష్, బచ్చు లీలాప్రసాద్, వెచ్చ కృష్ణకిషోర్, సోమశేఖర్ పాల్గొన్నారు.



ఉత్సవ పూజల్లో భక్తులు

## పరిష్కార వేదికకు అధికారులు గైర్హాజరు

ప్రత్తిపాడు: మండల కేంద్రంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అధికారులు గైర్హాజరయ్యారు. ఉదయం 11 గంటల్లోపు కేవలం వెలుగు ఏపీఎం లాజరు, ఇన్‌చార్జి సీడీపీవో విజయనిర్మల, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వినీల్, ఏవో అరుణకుమారి.. విద్యాశాఖ నుంచి సీఆర్పీ శ్రీనివాస్‌లు హాజరయ్యారు. 11 గంటల తరువాత ఎంపీడీవో కె.శివపార్వతి, పీఆర్ ఏఈలు.. 11.30 గంటలకు తహసీల్దార్ కరుణకుమార్ పీజీఆర్ఎస్‌కు హాజరయ్యారు. కాగా వైద్యశాఖ, దేవాదాయ, ఎక్సైజ్, ఉపాధి హామీ, పశుసంవర్ధకశాఖ, డ్రైనేజీ, కార్మికశాఖ, అటవీశాఖ, ఉద్యానశాఖ, వంకాయలపాడు మేజర్, సంక్షేమ వసతి గృహాల ఇన్‌చార్జిలు, విద్యుత్‌శాఖ అధికారులు గైర్హాజరయ్యారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రీవెన్స్‌కు అన్ని శాఖల అధికారులు సమయానికి హాజరైతే ఫిర్యాదు దారుల సమస్యలు త్వరితగతిన పరిష్కారమయ్యే వెసులుబాటు ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.



11 గంటలకు హాజరైన కొందరు అధికారులు

### బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలి

కాకుమాను: బడి ఈడు పిల్లలందరూ బడిలో ఉండే విధంగా తల్లిదండ్రులు కృషి చేయాలని ఎంఈఓ కేవీఫ్ కెనడీ అన్నారు. సమగ్ర శిక్ష ఆదేశాల మేరకు బడి ఈడు పిల్లలను గుర్తించేందుకు సోమవారం ఇంటింటి సర్వే నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ విద్య ముగించుకున్న చిన్నారులను తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్నభోజనం ఉచితంగా ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ఐఈఆర్‌టీ టీచర్ దయమ్మ తదితరులు పాల్గొన్నారు.

### మురుగు పారుదల జరిగే విధంగా చూడండి

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న



తెనాలిఅర్బన్: కాల్వల్లో మురుగు పారుదల జరిగే విధంగా చూడాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పేర్కొన్నారు. 19వ వార్డులో సోమవారం ఆయన పర్యటించారు. ఆప్రాంతంలో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులు పరిశీలించారు. కమిషనర్ స్వయంగా కాల్వల్లోని వ్యర్థాలను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు కాల్వలను బాగు చేస్తే చాలా వరకు మురుగు సమస్య పరిష్కారం అయ్యే అవకాశం ఉందన్నారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ ఉద్యోగులు ఉన్నారు.

### రోడ్లపై వ్యర్థాలు లేకుండా చూడండి



తెనాలిఅర్బన్: రోడ్లపై వ్యర్థాలు లేకుండా చూడాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు సూచించారు. చెంచుపేటలో సోమవారం ఉదయం ఆయన పర్యటించారు. ఆ ప్రాంతంలో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వాహణ పనులు పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నూరు శాతం చెత్త సేకరణ జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ ఉన్నారు.

### యోగాపై శిక్షణ

కొల్లిపర: మండల స్థాయి అధికారులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు, సచివాలయం ఉద్యోగులకు మంగళవారం ఉదయం 7 నుంచి 8 గంటల వరకు యోగాపై శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం 31వ తేదీ వరకు ఉంటుందని ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో సమావేశంలో ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని మండల స్థాయిలో యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. శిక్షణను కొల్లిపరలోని హరి కల్యాణమండపం, వల్లభాపురం హౌటువారిపాలెం కల్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండల పరిధిలోని అధికారులు, సిబ్బంది హాజరై శిక్షణను విజయవంతం చేయాలని కోరారు.

## చోరీ కేసులో నిందితులకు జైలు శిక్ష

కొల్లిపర: ద్విచక్రవాహనాల చోరీ కేసులో నిందితుడికి జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించింది. ఎస్సై పి కోటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం కొల్లిపర మండలం కుంచవరంకు చెందిన వెలివెల కోటేశ్వరావు తన ద్విచక్ర వాహనాన్ని ఇంటి ముందు నిలబెట్టి ఇంట్లోకి వెళ్లి ఉదయం లేచి చూసేసరికి కనిపించలేదు. దీంతో వాహనం చోరీకి గురైనట్లు నిర్ధారించుకుని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మరో ఘటనలో కొల్లిపరకు చెందిన కేశన గంగాధర్ రావు తన ద్విచక్ర వాహనం చోరీకి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రెండు ఫిర్యాదులపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల విచారణలో అమిరే ఆనంద్ కిషోర్, పిల్లి శ్రీను నిందితులుగా నిర్ధారించి అరెస్ట్ చేసి మోటార్ సైకిళ్ళను స్వాధీనం చేసుకుని కోర్టులు చార్జిషీటు దాఖలు చేశారు. కేసు విచారణలో సదరు ఇద్దరు ముద్దాయిలపై నేరం నిరూపణ కావడంతో ఆరు నెలలు జైలు శిక్ష విధిస్తూ తెనాలి రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ పి.రాజశేఖర్ తీర్పు వెలువరించారు. సీనియర్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పరిశపోగు సునీల్ కుమార్ ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

## సమస్యల పరిష్కార వేదికకు 13 అర్జీలు



అర్జీలను పరిశీలిస్తున్న ఆర్డీవో నేలపు రామలక్ష్మి

రేపల్లె: సమస్యల పరిష్కార వేదికకు 13 అర్జీలు అందినట్లు ఆర్డీవో నేలపు రామలక్ష్మి చెప్పారు. స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి అనంతరం మాట్లాడారు. తన భూమిని సర్వే చేసి హద్దులు చూపించాలని కోరుతూ చెరుకుపల్లి మండలం గుళ్ళపల్లికి చెందిన దాసరి రాజారావు ఒక అర్జీ, తన పొలం నుంచి వర్షపు నీరు బయటకు పోయే మార్గం మూసుకుపోయిందని డొంక మార్గంలో వేసిన గ్రావెల్ రోడ్డును తొలగించాలని పెసర్లంకకు చెందిన ఎర్రం సురేష్, తన పొలాన్ని సర్వే చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని పెద్దపులివర్రుకు చెందిన నిమ్మగడ్డ అన్నమ్మ, కొల్లూరు మండలం దోనేపూడికి చెందిన నూతక్కి అనసూయమ్మ, కనగాలకు చెందిన కుంచాల నాగమల్లేశ్వరి అర్జీలు ఇచ్చారన్నారు. తల్లి మరణ ధ్రువీకరణ పత్రం ఇప్పించాలని కోరుతూ ఉప్పుడికి చెందిన కొండముది శ్రావణి, తన పొలాన్ని సర్వే చేసి హద్దులు చూపించాలని చుండూరుకు చెందిన బెల్లం వెంకటసుబ్బారావు, కారుమూరుకు చెందిన వీరంకి వీరయ్య అర్జీలు ఇచ్చారన్నారు. ఇంటి ప్లాన్ అప్రూవల్ ఇవ్వాలని కోరుతూ వేమూరుకు చెందిన గరిక తిరుపతమ్మ, తనకు మంజూరు చేసిన నివేసన స్థలంకు హద్దులు చూపించాలని చట్రగడ్డకు చెందిన పిచ్చమ్మ అర్జీ ఇచ్చిందన్నారు. రీ సర్వేలో తన భూమి తక్కువ చూపిస్తుందని మరలా సర్వే చేసి సమస్యను పరిష్కరించాలని అరవపల్లికి చెందిన పరుచూరి వెంకట బుచ్చయ్య చౌదరి అర్జీ ఇచ్చారన్నారు. నగరం మండల అలపర్రులో ఉన్న తమ భూమి కోర్టు పరిధిలో ఉన్నందున ఎవరికి ఆన్‌లైన్ చేయరాదని నల్లూరిపాలెంకు చెందిన అమిరినేని వెంకటేశ్వరరావు, పొలం ఆన్‌లైన్ సమస్యపై నల్లూరు నుంచి తొటెంపూడి బుచ్చిరామకృష్ణ అర్జీ అందించారన్నారు. సమస్యలను పరిశీలించి పరిష్కరించడం జరుగుతుందని చెప్పారు.

## ఆపరేషన్ కగార్ పేరిట ఆదివాసీలపై దాడులు సరికాదు



నిరసన ప్రదర్శన చేపట్టిన ప్రజా సంఘాలు

బాపట్ల: ఆపరేషన్ కగార్ పేరిట ఆదివాసీలపై కేంద్ర ప్రభుత్వం సాగించిన, సాగిస్తున్న దమనకాండని వెంటనే ఆపివేయాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. సోమవారం అంబేద్కర్ సర్కిల్ వద్ద ఆపరేషన్ కగారును వెంటనే నిలిపివేయాలని మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని, ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ ఉమ్మడి గుంటూరు జిల్లా సహాయ కార్యదర్శి మేకల ప్రసాద్, నల్లమడ రైతు సంఘం నాయకులు కే విజయ్ కుమార్, సీపీఎం బాపట్ల టౌన్ కమిటీ నాయకులు శరత్, జై భీమ్‌రావు పార్టీ బాపట్ల ఇన్‌చార్జి కొచ్చెర వినయ్ రాజు, బహుజన సమాజ్ పార్టీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు గుదే రాజారావు, సీపీఎం జిల్లా నాయకులు పి.కొండయ్య, ప్రగతిశీల మహిళా సంఘం డివిజన్ కార్యదర్శి ముప్పాల పల్లవి, కేశవులు, ఐఎఫ్టీయూ జిల్లా నాయకులు ఎం.రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

## తెలుగుజాతి జీవనాడి బాపట్ల



తెలుగుతల్లి విగ్రహం వద్ద ఫోరం ఫర్ బెటర్ బాపట్ల నాయకులు

బాపట్ల: తెలుగుజాతి జీవనాడి బాపట్లగా చరిత్రలో స్థిరస్థాయిగా నిలిచిపోతుందని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టరు పి.సి.సాయిబాబు పేర్కొన్నారు. ప్రథమాంధ్ర మహాసభ 112వ వార్షికోత్సవ కార్యక్రమం సోమవారం ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో టౌన్ హాల్‌లో ఘనంగా జరిగింది. స్థానిక టౌన్ హాలులోని తెలుగుతల్లి విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా డాక్టరు పి.సి.సాయిబాబు మాట్లాడుతూ తెలుగుజాతి అస్తిత్వ సాధనలో బాపట్ల అద్వితీయమైన పాత్రను పోషించిందని గుర్తు చేసుకున్నారు. తెలుగు వారికి ఒక ప్రత్యేక రాష్ట్రం కావాలనే డిమాండ్ ఇక్కడే రూపుదిద్దుకుందని, ఆంధ్రుల స్వరాష్ట్ర వాంఛకు బీజం పడిన ప్రాంతంగా బాపట్లకు పేరు దక్కిందన్నారు. 1913లో బాపట్లలో జరిగిన ప్రథమాంధ్ర మహాసభ నాలుగు దశాబ్దాల ఆంధ్రోద్యమానికి నాంది పలికిందని తెలిపారు. టౌన్ హాల్‌లో జరిగిన మహాసభలు భాషా ప్రయుక్త రాష్ట్ర వాదనకు శ్రీకారం చుట్టాయని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంజీ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బి.దుర్గా ప్రసాదరావు, జన విజ్ఞాన వేదిక నాయకులు కోట వేంకటేశ్వర రెడ్డి, న్యాయవాది జమ్రుద్ బాషా, రిటైర్డు అధ్యాపకులు డా. కె.విజయకుమార్, నాయకులు గురజాల శ్రీనివాసరావు, కేశవులు, పనశాల, న్యూస్ పేపర్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## 2న ఇళ్ల స్థలాల కోసం మండల కేంద్రాల వద్ద ధర్నా

**మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్**



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్

బాపట్ల: ఇళ్ల స్థలాల కోసం మండల కేంద్రాల వద్ద జూన్ 2న ధర్నాలు చేపడుతున్నట్లు మాజీ ఎమ్మెల్సీ విల్సన్ పేర్కొన్నారు. సీపీఐ బాపట్ల జిల్లా కార్యాలయంలో సోమవారం సీపీఐ జిల్లా కౌన్సిల్ సమావేశం షేక్ కాలేషా గారి ఖాదర్‌బాషా అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి ఏడాది గడుస్తున్నా నేటికి ఇళ్ల స్థలాలపై స్పష్టత లేదన్నారు. వెంటనే ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షలు మంజూరు చేయాలన్నారు. సీపీఐ 100 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ప్రతి శాఖ ఆధ్వర్యంలో పర్యావరణం పరిరక్షించుట కొరకు గ్రామీణ ప్రాంతాలలో మొక్కలు నాటాలన్నారు. జూలై 9వ తేదీన జరిగే దేశవాప్త సార్వత్రిక సమ్మెకు మద్దతుగా పార్టీ సభ్యులందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. 11 ఏళ్లుగా దేశాన్ని పాలిస్తున్న మోదీ ప్రభుత్వం ప్రజలకిచ్చిన ఒక్క హామీ నేరవేర్చలేదని ప్రజల సమస్యలకు పరిష్కారం చూపలేదని విమర్శించారు. రైతు, నిరుద్యోగం, పేదరికం సమస్యలపై కనీసం మాట్లాడలేదని, నల్లధనాన్ని కట్టడి చేయలేదన్నారు. విదేశాలలో ఉన్న రూ.70 లక్షల కోట్లు వెనక్కి తీసుకురాలేదన్నారు. 44 కార్మిక చట్టాల స్థానంలో ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చి సూపర్ సిక్స్ హామీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా రాష్ట్రంలో ప్రస్తుతం కౌలు రైతులు, ప్రధానంగా నల్ల బర్లీ పొగాకు, మిర్చి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై వారికి మద్దతుగా రైతులను సమీకరించి ఉద్యమం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ, జిల్లా కౌన్సిల్ సభ్యులు బత్తుల శామ్యూల్, ఏటగిరి శ్రీనివాసరావు, చిరమల ప్రకాష్, నంబూరి సత్యం, సైకం రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## రఘుపతి వెంకటరత్నంను ఆదర్శంగా తీసుకోవాలి



గుంటూరు రూరల్: విద్యావేత్త, బ్రహ్మ రుషి, సామాజిక సుధారకుడు రఘుపతి వెంకటరత్నం నాయుడు వర్ధంతిని తెలగ అభ్యుదయ సంఘం నాయకులు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కాపు నాయకులు బాలిశెట్టి విజయకుమార్, డెగల వెంకటేశ్వరరావు, వూరిబండి శ్రీక్రాంత్ మాట్లాడుతూ.. రఘుపతి వెంకటరత్నం మహిళా విద్యను ప్రోత్సహించడంలో ప్రముఖ పాత్ర వహించారన్నారు. విద్యను ఒక సాధనంగా భావించి సమాజాన్ని మార్పు దిశగా నడిపించిన మహానుభావుడు రఘుపతి వెంకటరత్నం అన్నారు. విద్యార్థులు ఆయన సేవలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో కూటాల కృష్ణ, ఊరుబండి కృష్ణమూర్తి, శ్రీగిరి నరేంద్ర పాల్గొన్నారు.